నవలిక :

# మిస్. రుద్రాక్షమాల

రచన:- మల్లాది సూరిబాబు

ఆరోజున కాలేజీకి బయలుదేర బోతూంటే పత్రిక వచ్చింది. అలవాటు ప్రకారం వార ఫలితాలు చదవటం మొదలుపెట్టాను "ఈ వారంలో మీరు ఎన్నడూ ఊహించనటువంటిది, మీ జీవిత పంథానే మార్చగల ఆకస్మిక సంఘటన ఒకటి జరుగుతుంది" గడియారం తొమ్మిది కొట్టింది. గదికి తాళంవేసి, కాలేజీకి బయలుదేరానన్న మాటేగాని, జ్యోతిష్కుడి మాటలే మనస్సులో మార్మోగుతున్నాయి.

జీవిత పంథానే మార్చగల ఆకస్మిక సంఘటన అంటే? కాలేజిలోంచి 'డిబారు' చేస్తారా? సరస మాడబోయిన ఏ చిన్నదాని తాలూకు పెద్దలన్నా సమయంచూసి దేహశుద్ధి చేస్తారా? లేకపోతే ఏ బాపతుదన్నా ముదనష్టం ఎస్టేటు ఒకటి మనపాల బడుతుందా? అని పరిపరి విధాల తర్కించుకుంటూ బస్సు స్టాపు చేరాను. అక్కడి వాతావరణంలో ఏ మార్పూ లేదు. రకరకాల బస్సుల కోసం జనం మామూలుగానే రకరకాల 'క్యూ' లలో బారులుతీర్చి నిలబడి వున్నారు. ఒక్కొక్క బస్సే రావటం, పట్టినంత మందిని ఎక్కించుకుని పోవడం, ఇది నిత్యం జరిగే కాండే ఈనాడూ జరుగుతోంది. పదమూడు నెంబరు బస్సు 'క్యూ' లో ఏడెనిమిది మంది జనంకంటే ఎక్కువలేరు. బస్సు రావటానికి యింకా రవ్వంత వ్యవధి వుంది. చేసేదిలేక చూపులు అటూ యిటూ సారించి, దిక్కులు చూడటం మొదలుపెట్టాను. కృష్ణస్వామి స్ట్రీటులోంచి, ఎవరో కాషాయాంబరధారి యిటే వస్తున్నారు. ఎవరీ ఆడస్వాముల వారు? పాదచారులై యిల్లా ఎక్కడికి దయ చేస్తున్నారు? అని నాలో నేను ఒక్క క్షణం తర్కించుకుని సందేహాలతో, సమస్యలతో, సతమతమవుతూ నిలబడగా, వారు చేరువకు వచ్చారు. వారిని చూసి మనస్సులోనే అంజలి ఘటియించాను. ఆ చామంతిరేకుల వన్నె చిన్నది! ఆ అపురూప సౌందర్యరాశి, ఆ అపురూప అలేఖ్య తనూ విలాసిత! ఇహం పరం లనవి కాదని, సర్వస్వం త్యాగంచేసి, వాంఛలు విడనాడిన ఆశ్రమ వాసిని కాదు. కాషాయరంగు జార్జెట్ చీర ప్లాస్టిక్ రుద్రాక్షమాల ధరించి, రెండు నల్లత్రాచు లాంటి జడలు, రెండు కెంపు వన్నె గులాబీలతో దివ్యంగా వుండి, నిగనిగాల సొగసుతో పై పొంగి పొరలే వయసులో వున్న కాలేజీ కన్నె. ఆమెని అనుసరించి, పుస్తకాలు పట్టుకు వస్తున్న దాసి. దాస దాసీ జనాలతో విచ్చేసారు. రాచవారేమో? రాచవారి కన్నెలు కాలు క్రింద మోపరుగదా? ఎండకన్నెరుగని అసూర్య సంపశ్యలు, చూపుకే కందిపోయే సుకుమారులు. యీ విధంగా కాలినడకను నడచి, పామరజనం ఎక్కే బస్సు కోసం రావటం అబ్బురంగా వుందే!! తమ ప్రజానీకం పడే పాట్లనూ కష్టసుఖాలను స్వయంగా విచారించి తెలుసుకోవడానికి యిల్లా దయ చేశారేమో? అని నేను సతమత మవుతున్న క్షణంలో, ఆ అలికులవేణి, నా వెనుకవచ్చి నిలచేసరికి నాకు ఒక్కసారిగా దగ్గరలోనే, వెయ్యి మెరుపులు మెరిసినట్టయి గులాబీల ఘుమఘుమలు చిన్నదాని సోయగం నన్ను మత్తెక్కించి, బస్సువచ్చిన సంగతే మరచేటట్టు చేసేసరికి

బస్సు స్టాపులో నిలబడ్డ ట్రాన్సుపోర్టు ఇనస్పెక్టరు "ఏరుంగో! (ఎక్కండి) అని అనగానే, నేను తెప్పరిల్లి, మనస్సు కూడదీసుకుని, బస్సు ఎక్కాను. ఆ చిన్నదికూడా నా వెనుకనే బస్సు ఎక్కబోయింది. కండక్టరు నిర్దాక్షిణ్యంగా 'ఏడమిల్లై' (స్థలంలేదు) అని అనేసరికి నేను బస్సులోంచి క్రిందకుదిగి You Please get in I will go by next Bus' అని అన్నాను.

చిన్నది బస్సు ఎక్కి వెళ్ళిపోయింది. క్యూలో నా వెనక నిలబడ్డ కుర్రవాడు 'నల్ల వాన్ నాలివన్' అంటూ తనలో తాను గొణుక్కున్నాడు. ఏమిటి వీడు వాలి నల్లగా వున్నావని అంటున్నాడా? అని మనస్సులో ప్రశ్న వచ్చింది. ఆ ప్రశ్నకు సమాధానం అన్నట్టు ఎదురుగుండా గోడమీద 'నల్లవాన్ వాలివన్' అన్న సినిమా పోష్టరు కనిపించింది. రెండో బస్సు వచ్చింది. అదృష్టవశాత్తు అట్టే మంది జనం లేకపోవడంవల్ల కూర్చోవడానికి స్థలం దొరికింది అదికూడా ఎక్కడ? మడికట్టుకుని గుళ్ళోకి వెళ్ళవస్తున్న అరవైఏళ్ళ అవ్వగారి పక్కన. బుద్ధిమంతుడిలాగా కూర్చొని సుఖంగా ప్రయాణంచేసి, కాలేజీకి వెళ్ళాను.

క్లాసులో లెక్చరరు తన శాయశక్తులా తనకివచ్చే జీతానికి ఎన్నోరెట్లు ఎక్కువగానే పాఠం చెబుతున్నాడు. కాని మన మనస్సు అక్కడ వుంటేగా!

'ఎందు జూచిన గాని నీవేనే లైలా!' అన్న పాట మనస్సులో గజిబిజిగా రొద చేస్తూంటే 'థియరీ ఆఫ్ రిలేటివిటీ' ఎవరికి కావాలి?

ఇంటికి వచ్చానన్న మాటేగాని అన్నం సహిస్తేనా? హోటలువాడి లోపమేమీ లేదు. రాత్రి కంటిమీద కునుకు పడితేనా? మరునాడు తెల్లవారి అద్దంలో ముఖం చూసుకుంటే, పెద్ద 'ఖాయిలా' పడి పది లంఖణాలు చేసినంత డీలాగా వుంది.

మళ్ళీ కాలేజీ టైము అయింది. బస్సు స్టాండు చేరాను. నిన్న కనబడ్డ రుద్రాక్షమాలా సుందరి, సఖీజన సమూహంతో అప్పటికే వచ్చి 'క్యూ' లో పదిహేను స్థానాలు ముందర నిలబడి వుంది. నన్ను చూసింది. చూడనట్టుగా నటించింది. చెలికత్తెలతో, గుస గుస మని పావురాయిలాగా ఏదో గుస గుస వార్త చెబుతోంది అది విని వాళ్ళంతా ఒక్క క్షణం పరకాయించి చూశారు. మళ్ళీ వాళ్ళు కాన్ఫరెన్సు కంటిన్యూ చేస్తూ, ఒక

చిన్నగి నిన్న నాకు కనిపించిన చిన్నదానితో ఏదో రవ్వంత చిలిపిమాట అన్నది. ఆ మాట విన్న చిన్నది చిన్నగా నవ్వితే, ఆ మాట ఆమెచేతనే యింకోకసారి అనిపించుకుని బిగ్గరగా నవ్వారు బస్సు వచ్చింది. స్త్రీ సమూహాన్ని కొసరన్నా మిగల్చకుండా ఎక్కించుకుని వెళ్ళిపోయింది. నేనూ నా ముందర 'నల్లవాన్ వాలిబన్' నిలిచాం. ఆ పరిసరాలలో వందలాదిగా జనం వున్నా ఆ క్షణంలో మాత్రం నేను అంతులేని ఒంటరితనం అనుభవించాను. ఎందుకనో గాని మనస్సు చిన్నబోయింది నిలబడే కలం పట్టాను ఆశువుగా కవిత్వ మొచ్చింది. బస్సు రాకపోతే భారతమంత ఉద్గ్రంథం రాసే వాడినే రాసినా ఏం లాభం? 'చెస్టరు టన్' చెప్పినట్లు మహాకావ్యానికి యిది కాలం కాదు. అందుకనే చిన్న గీతికతోనే, వేదనంతా వెళ్ళడిచేసి, నిట్టూర్పుతో నిరాశతో బస్సు ఎక్కాను. నిన్న కనబడ్డ అవ్వగారు యివ్వాళకూడా కనిపించారు. అలవాటుగా ఆవిడ ప్రక్కన పరిచయాంచేసి, వేళకు అడంగు చేరాను.

మూడవనాడు మదనుడు మన పక్షంలో వున్నాడో ఏమో క్యూలో రుద్రాక్షమాలకి వెనుకనే స్థలం దొరికింది. బస్సులోకూడా ఆవిడ సరసనున్న సీటే ఖాళీగా వుంది. నేను చిన్నదాని సరసను కూర్చోవడానికి సందేహించినట్టుగా ఒక్క క్షణం తటపటాయిస్తే ఆ చిన్నగి నావంక ఒక్కసారి చూసి, నాకు స్థలం చాలదేమో నన్నట్టు తాను రవ్వంత ఒదిగి కూర్చుంది. నేను సరసనే కూర్చుని 'థ్యాంక్యూ' అని అన్నాను. ఆ సుందరాంగి తనలో తాను అనుకున్నట్టు నాకు మాత్రం వినిపించేటట్టు

'ప్లీజ్ డోంట్ మెంషన్' అని అన్నది. అక్కడితో సంభాషణ కుంటుపడింది. నేను కూడా బుద్ధిమంతుడలాగా, నిన్నటి పాఠ్యమేదో చూద్దామని నోట్సు తెరిచాను. పొద్దుటి కంటే ముందర బస్సుస్టాండులో నేను రాసిన గీతిక కంటపడ్డది. నిన్నటి ఆవేశంలో ఏం రాశానో చూద్దామని గీతం చదవటం మొదలు పెట్టాను.

నా ఎదలో వెతలకు
    ఫుల్‌స్టాపు పెట్టిన చిన్నది
కనిపించింది
    నిన్న బస్సుస్టాపులో
ఆవేదనా ఆరాటనా
    ఆ క్షణంలో స్టాపు
ఆనందం ఆహ్లాదం
    నాన్ స్టాపు.

కన్నులు కలసిన కాలంలో
    గుండె క్షణం స్టాపు
మరుక్షణంలో గుండె దడదడ
    నాన్ స్టాపు.
ఆలోచనలన్నీ స్టాపు
ఆవేశం నాన్ స్టాపు.
చిరునవ్వు వెన్నెల్లో
చింతలన్నీ స్టాపు
చింతలు మాసిన
    మనసులో
మమతలు నాన్‌స్టాపు.
బస్సు స్టాపులో బస్సు
    చూడగానే ఆనందం స్టాపు
చెంత నిలచిన చిన్నది
    దూరమైతే
హృదయంలో ఆవేదన
    మళ్ళీ నాన్‌స్టాపు.

చిన్నది యిదంతా ఓరకంట కనిపెడుతూనే వుంది. ఐనా యీ తెలుగు పద్యం యీ ఆంధ్రేతర సుందరికి ఏం అర్థమవుతుందిలే. ఏనాటికైనా యీ చిన్నదానితో మాట కలిస్తే, మనస్సు విప్పి చెప్పడానికి అవకాశం దైవం కలిపిస్తే ఈ గానాన్ని ఆ చిన్నదాని భాషలోకి మార్పిడిచేసి వినిపించి తీరవలసిందే. ఏ కిన్నరదాసుగారినో ప్రాధేయపడి విశ్వనాథం రామమూర్తి సంగీత నిర్దేశనంలో పి. బి. శ్రీనివాసులు కంఠంలో యీ పాటస్టీరియోలో రికార్డుచేసి, దాన్ని గ్రుండిగ్ రేడియోగ్రాములమీద వినిపించాలి. వింటున్నప్పుడు ఆవిడ ముఖం ఎల్లా వుంటుందో చూసి, మందహాసం కనిపిస్తే మనం ఆనందా భూతిలో మైమరచిపోవాలి.

మరునాడుకూడా దైవికంగా ఇద్దరం ఒకచోటనే కూర్చోవడం సంభవించింది. నేను పుస్తకం తీసి చదువుకో[illegible] ఆ చిన్నది కూడా తన నోటుబుక్కు తీసి చదువుతున్నట్టు నటిస్తోంది యథాలాపంగా నేను ఆ పిల్ల పుస్తకం వంక చూశాను. చక్కటి ముత్యాలలాంటి తెలుగు అక్షరాలలో, ఒక ప్రశ్న నా కోసం ఎదురు చూస్తోంది.

'నిన్నటి మీ కవిత్వం నిజమా? కల్పనా?'

ఆ ప్రశ్న చూడగానే నా హృదయం ఆనందంతో వెర్రిగంతులు వేసింది. ఈ చిన్నది మన భాష ఆడంగుదే!! మాతృభాష చాలు. వడి వడిగా వెళ్ళి బస్సులో సమాధానం రాయబోతే అక్షరాలు వంకర టింకరగా, ఒకటో తరగతి వాడి రాతకన్న కనాకిష్టంగా వున్నాయి.

'కల్పనలు సృష్టించడానికి నేను కవిని కాను.'

సమాధానం చదివి, చిన్నది ఎందుకనో కెంపువన్నె వొచ్చిన ముఖం దించుకుని తనలో తాను చిరునవ్వు నవ్వుకుంది.

మధ్యలో బస్సు ఆగగానే, ఒక భద్రమహిళ బస్సు నెక్కింది. ఎక్కగానే నా వంక కొరకొరా చూసింది. నే నావిడ చూపులకు తట్టుకోలేక, బస్సు టాపువంక ఏ 'అగరుబత్తీ' అడ్వర్‌టైజుమెంటు' అన్నా కనిపిస్తుందేమో నని చుట్టూతా కలయజూచాను. నా సీటు కిటికీపైన

'లేడీస్' (స్త్రీలు) అని రాసివుంది.

నేను ఉలిక్కిపడి సీటులోంచి రాకెట్టులాగా ఎగిరి లేచి నిలబడి

ఉత్కారుంగా [కూర్చోండి] అని అంటూ ఆవిడకి సీటు చూపించాను. ఆవిడ కూర్చుని, ముడిచిన భ్రూకుటులు సరిదిద్ది ముడుసలి ముఖంలోంచి చిరాకు దూరం చేసుకునేసరికి, ఆవిడ ముఖంలోకి చిరునవ్వు చిన్నతనం మళ్ళీ వచ్చాయి.

మరునాటి నుంచి సెలవులు. కేపిగారికి చూచ్చినాలు లేవు. ఈ సారి ఎందుకనో గాని, సెలవలివ్వారన్న సరదా గాని సంబరంగాని లేవు, ఆ నాడు, అంటే పదిరోజుల తరువాత ఒకనాడు, ఒంటరితనం విరహం భరించలేక

ఎక్కడికైనా పోదామని డ్రెస్ చేసుకుని, (ఫ్రెంచి) టై 'డబుల్ నాట్' వేసుకుంటూ వుండగా, మేడమీద రేడియో పాటలోంచి

'కహీ తనహాయి దో గం మే తుమ్
హామారీ యాద్ ఆయేగీ'

అన్నా ముబారక్ బేగం పాట వినిపిస్తోంది. పాట ముబారక్ బేగం దైనా కంఠం మాత్రం మా సేట అపరలతా మంగేష్కరుది. అంటే మా మేడమీద రెండో భాగంలో అద్దెకుంటున్న ఇంజనీయరుగారి ఏకైక పుత్రిక. ఇంత చిన్న వయసులో యింత దిగులుగా పాడుతోంది. యీ చక్కని చుక్కకు వచ్చిన కష్టమేమిటోనని ఉర్దూ డిక్షనరీ తీసి అర్థం చూస్తే తనహాయి అంటే, ఒంటరితనం, ఏకాంతం విరహం వగైరా అర్థాలు వున్నట్టుగా తెలిసింది. ఆ పిల్లది పాడిన ఒక చరణం ఆకళింపు చేసుకునేసరికి

విరహాపు వేళలలో ఎన్నడైన
ఈ చెలి తలపు నీ మదిలో మసలేనా'

అని అర్థమైంది. నేను నిట్టూర్పు విడిచి నాలో నేను అనుకుంటున్నట్టుగా

'ఇద్దర మెక్కింది ఒకటే పడవ చిన్నదానా!' అని అనుకొని హుటాహుటి బయలుదేరి ఆక్వేరియం హోటలుకు (ప్రస్తుతం మెరినా కాంటీను) వెళ్లాను. బయట చలి వేస్తున్నట్టు వున్నా ఐస్ కాఫీ ఆర్డరు యిచ్చి పావలాకాసు జ్యూక్ బాక్సులో పడేసి. మీటనొక్కి వచ్చి కూర్చున్నాను. కూర్చున్న క్షణంలో అసలు లతామంగేష్కరు కంఠం

'కహీదీప్ జలే కహీ దిల్ కి' అంటూ పాడటం మొదలు పెట్టింది. పాట పూర్తి అవుతూ వుండగా ఐస్ కాఫీ వచ్చింది. కాఫీ త్రాగుతూ వుండగా పాట పూర్తయింది. వెంటనే మళ్ళీ అ పాటే ప్రారంభమైంది. ఎవరా? అని తల ఎత్తి చూసేసరికి, కనిపించింది ఎవరూ!

ఆదస్వాములవారు!! ఎవరో సాహసగత్తెతో యిటే తరలి వస్తున్నారు. అంటే యింతసేపూ లోపలే వున్నారన్నమాట! ఆ చిన్నది కంట పడగానే ఇంతకాలం వేధిస్తున్న నిరాశ, ఒంటరితనం యిట్టేమాయమై నా మనస్సులోని ఆశలు బంగారు అంచులా తొక్కాయి. మదిలోని పొంగులు రెక్కలు విప్పాయి.

నేను కూర్చున్న బల్లని సమీపించగానే, చిన్నదాని మనస్సు ఒక్క క్షణం ఏదో ఆలోచనలో పడ్డది. వెంటనే మందహాసంతో బాటు మనంకూడా జ్ఞాపకానికి వచ్చాము.

నేను కుర్చీ లోంచి లేచి నిలబడి 'నమస్తే' అని అన్నాను

ఒక్క క్షణం చిన్నది తెల్లబోయింది. మళ్ళీ అంతలోనె సంబాళించుకుని,

'నమస్తే' అని ప్రతి నమస్కారం చేస్తూ తన సాహసగత్తెను నాకు చూపిస్తు

'మా ఫ్రెండు రాధ.

వీరు మిస్టర్ రామం ప్రెసిడెన్సీలో పోస్టు గ్రాడ్యుయేట్ చేస్తున్నారు' అంటూ, నన్ను పరిచయం చేసింది.

నన్ను గురించి యింత యిన్ఫర్మేషన్ ఎప్పుడు ఎల్లా సంపాదించింది అని నేను ఆశ్చర్యపడిపోయాను.

కూర్చోండి అని వాళ్ళిద్దరిని ఆహ్వానించాను. వాళ్ళు కూర్చున్నారు. తన చెలికత్తె పేరు చెప్పింది కాని తన పేరు చెప్పలేదు ఏ పేరుతో పిలవటం అని సందిగ్ధంలో పడ్డాను. రాధ మెడికల్ కాలేజీలో చదువుతోందిట. కేరళ రాష్ట్రంలోని 'చంగానాచెర్రి వాళ్ళ స్వగ్రామంట' అని రాధ స్నేహితురాలు చెప్పింది. స్నేహితురాళ్లు యిద్దరూ, నా బలవంతం ఆహ్వానంమీద యింకొక కప్పు కాఫీ త్రాగారు. ఒక్కసారి కూడబలుక్కున్నట్లు, తమ తమ గడియారాల వంక చూసుకున్నారు. ఆ సంకేతాన్ని గ్రహించిన నేను

'ఏదో పనిమీద వున్నట్టున్నారు?' అని అడిగాను.

వాళ్ళు ఒక్క క్షణం తటపటాయించి 'సినిమాకి వెడుతున్నాం' అని సమాధానమిచ్చారు.

ఇంగ్లీషు పిక్చరా!

కాదు. అరవ పిక్చరు. 'నెంజిల్ ఓరు ఆలయం' చాలా గొప్ప పిక్చరు. మీకేం పని లేకపోతే మీరుకూడా రండి' అంటూ రాధమ్మ ఆహ్వానించింది.

నేను ఒక్క క్షణం తటపటాయించాను. నేను ఏమంటానో విందామని ఆదస్వాములవారు అదేక ధ్యానంలో వున్నారు.

'మీకు యిబ్బందేమో' అని ఒక చిన్న డైలాగు వాడాను.

'యిబ్బందేముందండి తెలిసిన వాళ్ళమంతా కలిసి చూస్తే ఎటువంటి సినిమాయైనా సరే చాలా బాగుంటుంది.'

'O. K. Thank you Very much' అని నేను అన్నాను. ఇద్దరు అందమైన పిల్లలు వెంటరాగా హోటలుకుంచి బయటకు నడిచి వచ్చాను. ముగ్గురం టాక్సీ యెక్కాం. టాక్సీ కదిలే ముందర మనస్సులో ఒక ఆలోచన వచ్చింది.

'వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో రేపు కొబ్బరికాయ కొట్టాలి.' కారు కాసినో చేరింది. అదృష్టంకొద్దీ అట్టే యిబ్బంది లేకుండానే, టికెట్లు దొరికాయి. మామూలు రోజుల్లో అరవైఏడు కాని మూటముప్పై మూడు పైసలకంటే, సినిమాకోసం ఎక్కువ ఖర్చుపెట్టని నేను తల ఒక్కింటికి రెండు రూపాయిల అరవైరెండు నయాపైసలు ఖర్చు పెట్టడానికి చింతపడలేదు సరికదా, ఆ సినిమాలో కూర్చున్నంతసేపూ స్వర్గమంటె యిదే ననిపించింది. సినిమా పూర్తై అంతా బయటకు వచ్చాం. నేనూ ఆదస్వాములవారు మిగిలాం. నేను ధైర్యంచేసి,

'ఏమండీ మిమ్మల్ని ఒక్కమాట అడగనా'

'అడగండి'

'మీ పూర్తిపేరేమిటి?'

'శ్యామల' అంటూ ఫక్కున నవ్వింది. ఆ నవ్వు వింటుంటే పర్వతం మీదనుంచి నురుగులు వేసుకుంటూ వచ్చే వాగు గుర్తుకువస్తే, ఆ నవ్వు చూస్తుంటె వెన్నెలరాత్రి మెరుపు మెరిసినట్టు అనిపించింది. ఆ మనిషి దగ్గరున్న వేళా విశేష మంటుంటాను. ఒక్కొక్కసారి వెంటపడి పరుగెత్తుతేనే కాని మన మాట ఆలకించని టాక్సీవాడు ఈనాడు, ఎందుకనో, మా జంటని చూడగానే, వేగం తగ్గించి, కారు పేవ్ మెంటు దగ్గరకు రానిచ్చి,

'హాఫ్ నాట్' అని అనేసరికి 'నేను నీను గక్కినంత సంబరంతో 'ఉండి మీ యింటి దగ్గర డ్రాప్ చేస్తాను' అని అన్నాను.

'థాంక్యూ' అంటూ కారు ఎక్కింది.

నేను డ్రైవరు ప్రక్కన ముందుసీటులో కూర్చున్నాను.

'సినిమా ఎల్లావుంది' అని తెలుగులో అడిగింది.

'అన్ని విధాల చాలా బాగుంది, కాని ఆ సీతని చూస్తుంటే

సీతని చూస్తుంటే ...

స్త్రీ జాతి అంటే చాలా కోపం వచ్చింది.

ఎందుకని

సీత చేస్తున్న ప్రతి పనిలో, అనిన ప్రతి మాటలో స్వార్థమే కనిపించింది.

అందులో స్వార్థమేముంది ?

తనని ప్రేమించిన వ్యక్తి సర్వనాశన మవుతూవుంటే, చూస్తూ వూరుకుంది కాని ఏమాత్రం సహాయం చెయ్యడానికి ప్రయత్నం చెయ్యలేదు.'

'సీతని అంటారుగాని, మురళీ చేసిన పని మాత్రం ఏం బాగుంది? ఒకప్పుడు తాము యిద్దరూ ప్రేమించుకున్నారు బాగానేవుంది. కాని ఆ ప్రేమ ఫలించలేదు. తన ప్రియురాలు యింకొక వ్యక్తి భార్య అయింది, ఆ పరిస్థితులలో పూర్వస్మృతులు జ్ఞప్తికి తెచ్చి, బాధ పెట్టడం న్యాయమా మరి మర్యాద కలే 'తాండవమా' !!

'మనంత తాపీగా యీ సమస్యని గురించి ఆలోచించాలసింది ఏమీ లేదు చూడండి శ్యామలాదేవి గారు'

శ్యామలాదేవిని కాను, శ్యామలనే.

'చూడండి శ్యామల గారూ, అదృష్టవంతుడని ప్రేమ ఆకాశాని ఎత్తుతుంది, అదే ప్రేమ దురదృష్టవంతుడని అధఃపాతాళానికి అణగ ద్రొక్కుతుంది.'

'నిజం నేనూ ఇదే అనుకున్నాను. మీరు కవులు కాబట్టే యింత బాగా చెప్పగలిగారు.'

కవినంటూ నన్ను ఎగతాళి చేస్తున్నారు.

ఎగతాళి కాదు. మీరు కవి అని చెప్పడానికి మీ బస్సుస్టాపు పద్యం చాలు.

'థ్యాంక్యూ'

ఒక్క క్షణం ఆగి శ్యామల "మీ హాబీసు ఏమిటి ?" అని అడిగింది.

"ఫొటోగ్రాఫీ, కథలు రాయడం, క్రికెట్టు, టెన్నిసు."

'ఇదేనా ? పరాయి ఆడపిల్లలని పలకరించడం కూడా మీ హాబీ ఏమో అనుకున్నా'

నన్ను ఎవరో కొరడాతో కొట్టినట్లనిపించింది.

మీరు యిందాక హోటల్లో పలుకరించగానే ఏమనిపించిందో తెలుసా ?

ఏమనిపించిది ?

మనుచరిత్రలో పద్యం గుర్తుకు వచ్చింది.

ఏ పద్యం

'ఇంతటి కన్నులుండ తెరువెవ్వరి వేడెద
భూసురేంద్ర !'

ఏకాంత మందున్న జవరాండ్ర నెపంబిడి...'

'మిగతా పద్యం నాకు వచ్చు' అని నేను అర్థోక్తిగా అన్నాను. వాణీమహలు దాటి కారు ముందుకు సాగుతోంది.

'నేను ఇక్కడ దిగుతాను' అని శ్యామల అంది. కారు ఆగగానే, మేమిద్దరం దిగాం.

'నేను గుడ్ నైట్' అని అన్నాను. తను కూడా

'గుడ్ నైట్' అని అంటూ వెళ్ళిపోయింది.

(సశేషం)



## హృదయ స్పందనం

వింటారా ...! తపిస్తారు ...!!
నవ్వటమే మఱచిపోతారు !
నా మానసిక వ్యథ వింటుంటే ..
ఓపికతో మీ రుండలేరు !!

ఇది అహృదయుని గాథ—
మఱచి క్షణమైనా — అతనికి
సంతసం సరస జేరలేదు !
నవ్వటంగూడా రాదు !!
వింటుంటే ... అశ్రువులు,
విడువకుండా ఉండలేరు !
నా మానసిక వ్యథ వింటుంటే ...
ఓపికతో మీ రుండలేరు !!

హృదయాన్ని రక్తమయం
చేయడానికే కాబోలు
ఉబికి వస్తుంటాయి — కన్నీరు !
నవ్వించలేవు కాని, అవి
దుఃఖములో ముంచివేస్తాయి
కనురెప్పలలో దాచిఉంచినా
శోకసూచకంగా బయటపడ్తాయి
దీనితో దీపాన్ని వెలిగిస్తే — అది
జీవనాన్నే రగిలిస్తుంది !!

ఈ ప్రపంచంలో—
మఱచి ఎవరైనా నవ్వుతుంటే ...
బలవంతంగా ఏడ్పిస్తారెవరో !
ఏడుస్తూ ఎవరైనా ఉంటే ...
నగుబాటు చేస్తుంటారెవరో !
ఇక, నా మానసిక వేదనను
ఎవరిదరికెళ్ళి వినిపించాలి !!

నా మానసిక వ్యథ వింటుంటే ...
ఓపికతో మీ రుండలేరు !
వింటారా ...! తపిస్తారు ...!!
నవ్వటమే మఱచిపోతారు !!!

సైద పరంధాములు